కథ

# సుమంగళి

**తురగా శివరామ వెంకటేశ్వర్లు**

**డబ్బున్న మనిషి కాకపోయినా, దానధర్మాలు చేయకపోయినా,ఆ ఊరి రాజకీయాల్లో పేరున్న కుటుంబ మనిషి కాకపోయినా, అర్వై సంవత్సరాల భానుమతి మంచానపడిందనే వార్త తెలిసి తనింట్లోనే కాదు,ఆవీధిలోనే కాదు, అవతల వీధిలోనే కాదు, పక్క వీధిలోనే కాదు, ఆగ్రామంలో మొత్తం అందరూ బాధపడ్డారు.**

"నాన్నా! నీకోసం ఎవరో వచ్చారు" అరుగుమీద కూర్చున్న భానుమతి ఇంట్లోకి చూస్తూ కేకేసింది.

రాజన్న గారు బయటికివస్తూ , "నువ్వా! చలమయ్యా! రా! లోపలికొచ్చి కూర్చో" అన్నారు కుర్చీచూపిస్తూ,

"చాలా కాలానికి కనపడ్డావు! పట్టణం నుంచి ఏమిటిలా వచ్చావు?" అడిగారు.

" పాలెంలో నాభూమి తగాదా ఇంకా తేల్లేదు. దాని గురించి వచ్చా!" చెప్పాడు చలమయ్య.

భానుమతిని పిలిచి, "కాఫీ ఇయ్యమ్మా చలమయ్యకు!" చెప్పారు రాజన్న గారు.

గ్లాసందించిన భానుమతిని చూసి,

" అమ్మాయి నీకూతురా?" అనడిగాడు.

"అవును అది పెద్దది. వీడు నా కొడుకు. అది పుట్టిన చాలేళ్ళవి పుట్టాడు" అక్కడ కూర్చుని గుణింతాలు దిద్దుతున్న ఐదేళ్ళ కుర్రాడి వైపు చూస్తూ చెప్పారు రాజన్న గారు.

" అమ్మాయికి పెళ్ళి చేయవా?" చలమయ్య అడిగిన ప్రశ్న విని

"పెళ్ళీడే కదా! సంబంధాలు చూస్తున్నాం. పట్నంలో ఏమైనా ఉంటే చెప్పు" అన్నారు రాజన్నగారు.

కాస్సేపాలోచించి,"ఓ అబ్బాయున్నాడు.పేరు నారాయణ!పాతికేళ్ళుంటాయి. కానీ అమ్మా నాన్నాలేరు. వాళ్ళ బాబయ్య దగ్గరుంటున్నాడు. ఎం.ఏ. ప్యాసయ్యాడు. మంచి ఉద్యోగమే చేస్తున్నాడు. నీ కిష్టమయితే మాట్లాడుతా!" చెప్పాడు చలమయ్య.

తర్వాత కొద్దిరోజులికి భానుమతి పెళ్ళి చూపులు, జాతకాలు నప్పడం,పెళ్ళి మాటలు జరిగిపోయాయి. భానుమతి భర్త స్థానం బలంగా ఉందన్నారు జాతకం చూసిన శాస్త్రి గారు భానుమతికి నారాయణతో పెళ్ళయిపోయింది.

పెళ్ళైయాకా నాలుగేళ్ళు భానుమతి కాపురం సవ్యంగానే జరిగింది. ఒక ఆడపిల్ల కూడా పుట్టింది.

ఒకరోజు నారాయణ ఇంటికి రాత్రి పడి ఆలస్యంగా వచ్చాడు. నారాయణ దగ్గర మందు వాసన పసిగట్టింది భానుమతి. నారాయణకి తాగి ఇంటికి రావడమలవాటయింది. భానుమతి ఈ అలవాటు మానుకోమని గట్టిగానే చెప్పేది. కానీ ఇద్దరి మధ్య ఘర్షణలే మిగిలేవి. కానీ అతను తాగుడలవాటు మానలేదు.

క్రమేపి ఇంటిని పట్టించుకోకుండగా చెడు స్నేహాలు, పేకాట కూడా మొదలెట్టాడు నారాయణ. భానుమతి సహించలేకపోయింది. పుట్టింటికి పోతానని బెదిరించింది.

ఒకరోజున చెప్పాపెట్టకుండా పిల్లలతో వచ్చిన భానుమతిని చూసి అమ్మనాన్నలు ఆశ్చర్యపోయారు.తర్వాత రెండ్రోజులికి మెల్లిగా చెప్పింది అసలు విషయం. నెలరోజులు నెట్టుకుని భార్య సలహాతో తిరిగి భానుమతిని మొగుడు దగ్గర దిగపెట్టారు రాజన్నగారు. అల్లుడికి బుద్ధిచెప్పారు.

రెండు మూడేళ్ళు గడిచాయి. మళ్ళీ నారాయణ వ్యసనాల భాగోతం మొదలయింది. భానుమతి గట్టిగానే గొడవ పడింది అతనితో. ఈ సారి నారాయణే పుట్టింటికి పొమ్మన్నాడు.

భానుమతి పుట్టింటికి వచ్చేసింది. నారాయణ వ్యసనాలు, ప్రవర్తన మానే వరకు అతని వద్దకెళ్ళే ప్రసక్తి లేదని అమ్మ నాన్నలతో ఖచ్చితంగా చెప్పేసింది కానీ అల్లుడొస్తాడని ఎదురు చూశారు వాళ్ళు. ఆర్నెలలైనా నారాయణ వచ్చి భానుమతిని తీసుకెళ్ళలేదు. రాజన్న గార్కి, భార్యకి కూతురు కాపురం లేకుండగా తమ దగ్గరే ఉండిపోవడం బాగోలేదు. ఊళ్ళో అందరూ అడుగుతున్నారు. పరిస్కారం కోసం ఆలోచన చేశారిద్దరూ. నారాయణ బాబయ్య దగ్గరికెళ్ళి మాట్లాడి అల్లుడు కూతుళ్ళను ఒప్పించి మళ్ళీ ఇద్దరినీ కలిపారు.

కొంత కాలం బాగానే ఓపిక పట్టింది భానుమతి. తర్వాత నారాయణ బాబయ్య వృద్దాప్యం వల్ల పొరుగు రాష్ట్రంలో ఉన్న కొడుకు దగ్గరికెళ్ళి పోయాడు. దానితో నారాయణకి బాగా స్వేచ్ఛెక్కువయి వ్యసనాలు ముదిరిపోయాయి. పైగా భానుమతి మీద చెయ్యి చేసుకోవడం మానసిక హింస మొదలెట్టాడు. భానుమతిలో క్రమేపి ఓర్పు, ఓపిక తగ్గాయి.ఒకరోజున ఇద్దరికీ పెద్ద గొడవే అయ్యింది. ఇంట్లోంచి పొమ్మన్నాడు నారాయణ. ఇంక తిరిగి రావక్కర్లేదన్నాడు. భానుమతి కూతురుతో పుట్టింటికి చేరింది. రాజన్న గారు ఏమి చేయలేక తన దగ్గరే పెట్టేసుకున్నారు.

రోజులు గడిచిపోతున్నాయి నారాయణ భానుమతిని వదిలేసి అప్పుడే రెండేళ్ళయి పోయింది. భానుమతికి పెళ్ళయి పదిహేనేళ్ళయింది.

ఒకరోజున రాజన్న గారు ఊళ్ళో తన స్నేహితుడుకి సాయంగా పట్టణంలో పెద్దాసుపత్రికి వెళ్ళారు. హాస్పిటల్ రిసెప్షన్ కౌంటరు దగ్గర నారాయణ కూర్చుని ఉన్నాడు. అల్లుడు కనపడేసరికి సంతోషంగా భుజం మీద చెయ్యేసి పలకరించారు రాజన్నగారు. ఎందుకొచ్చావనడిగారు.కానీ నారాయణ విసురుగా చెయ్యి తీసేసి ఒక్కమాట కూడా మాట్లాడలేదు. తన కూతురు గురించి గానీ, భార్య భానుమతి గురించిగానీ ఏమీ అడగలేదు.

ఇంటికొచ్చిన రాజన్నగారు దిగులుగా ఉండడం చూసి భానుమతి, తల్లి అడిగారు.

" ఏమైయిందండీ! అలా ఉన్నారు?" అని

నారాయణ పెద్దాసుపత్రి వద్ద కనపడ్డాడని చెప్పారు.

అ మాట విని అతృతగా అడిగింది భానుమతి. "నన్నూ, కూతుర్ని ఎలా ఉన్నామని అడిగారా?" అస్పత్రికి ఎందుకొచ్చారు? ఆయన ఎలా ఉన్నారు?

మనిషి బాగానే ఉన్నాడు. ఎందుకొచ్చాడో చెప్పలేదు" అంటూ అతను ప్రవర్తించిన తీరు చెప్పారు రాజన్నగారు.

తండ్రి ద్వారా మొగుడు క్షేమం తెలిసి నందుకు భానుమతి సంతోషించినా అతని ప్రవర్తనకిచాలా విచారించింది. అప్పటినుంచి భానుమతి ఆత్మాభిమానం అత్మ విశ్వాసం తన ఆలోచనల్ని నారాయణ వైపుకి తిరిగి వెళ్ళనివ్వలేదు. ఆ ఇంటి కాకి ఈ ఇంటిమీద,ఈ ఇంటికాకి ఆ ఇంటిమీద వాల్లేదు. వాళ్ళిద్దరి మధ్య దూరం అంతగా పెరిగింది. తర్వాత కొద్ది కాలానికే ఒక ఏడాది తేడాలో రాజన్న గారూ, భార్య కూడా కాలం చేసారు.

భానుమతికి కుటుంబ భారం తన మీదపడింది. భర్త వదిలేసాడనే సానుభూతి, నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందనే నిజం భానుమతికి ఉపయోగపడ్డాయి. తను కొంచె చదువుకున్నదైనందు వల్ల చిన్న క్లాసు పిల్లలకు ప్రైవేటులు చెప్పడం, కుట్టు మిషన్తో బట్టలు కుట్టడం, ఎవరికైనా అవసరమైన వాళ్ళకి సాయం చేయడం వంటి పనులతో సంపాదిస్తూ ఆ ఊళ్ళోనే స్థిరపడింది.

ఎప్పుడూ ముఖాన పసుపు రాసుకుని, నుదుట రూపాయంత ఎర్రటి కుంకుమ బొట్టు, చెవులుకి దుద్దులు పెట్టుకుని,రంగునేత చీర కట్టుకుని, మెడలో పసుపుతాడుకి మంగళ సూత్రాలు కట్టుకుని, రెండు చేతులకి మట్టి గాజులేసుకుని, ముత్తైదువగా, సుమంగళిగా కనపచే భానుమతికి ఆ ఊళ్ళో ఏ ఇంట పేరంటం జరిగినా మొదటి బొట్టు, మొదటివాయినం; ఏ నోము, వ్రతం జరిగినా మొదటి తాంబూలం, పసుపు కుంకుమలు అమెకే దక్కేవి. ఏఇంట ఆడపిల్ల పెళ్ళి జరిగినా మొదటి అక్షింతలు వేసేది భానుమతే! ఆ ఊళ్ళో పరీక్షకో, ఇంటర్వ్యూకో వెళ్ళే ఏ విద్యార్థికైనా భానుమతి ఎదురు రావలసిందే! అంతే కాదు! ఆఖరికి ఆగ్రామ పంచాయితీ ఎన్నికలకు నామినేషన్ వేసే వాళ్ళకూడా ముందుగా భానుమతే ఎదురురావాలి.

కొన్నాళ్ళకి చదువు పూర్తయి ఉద్యోగస్తుడైన తమ్ముడికి కూతుర్నిచ్చిపెళ్ళిచెయ్యాలను కుంది. గుళ్ళోపూజారిగార్ని పిలిచి తన ఆలోచన చెప్పి ముహూర్తం పెట్టమంది.

పూజారిగారు "అదెంతసేపు! పెడతాను.కానీ ముందుగా కన్యాదానంచేయడానికి మీ అయనకి కబురు చేయవమ్మా !" చెప్పారు.

"మీరు అమాయకులు పూజారి గారూ! మానాన్న ఉండగా పట్నంలో హాస్పిటల్లో కనపడ్డాయన్ని అప్యాయతగా పలకరిస్తే మానాన్నతో ఒక్కమాట కూడా మాట్లాడలేదు. కనీసం నా గురించి గానీ కూతురు గురించిగానీ ఎలా ఉన్నారని అడగలేదు. పోనీ ఆ సంగతి వదిలేయండి. ఇన్నాళ్ళైంది. దూరంగాఉంటున్నారు. ఒక్కసారైనా వచ్చారా? మమ్మల్ని చూశారా? ఓ కబురు చేశారా? తన క్షేమం చెప్పారా?లేదే? అటువంటి వ్యక్తిని మీ అమ్మాయి పెళ్ళికి రండని పిలవమంటారా? పిలిచినా వస్తారా! మీ వెర్రిగానీ" బాధపడింది భానుమతి.

కొద్దిసేపాగి,"నువ్వన్నదీ బాగానే ఉంది! మరేంచేస్తావు?'' అడిగారు పూజారిగారు. ఏముంది.నామేనత్త కొడుకు,పెళ్ళాం ఉన్నారు.వాళ్ళకి సంతానం ఎటూ లేదు. ఆ దంపతుల చేత కన్యాదానం చేయిస్తా! ఆఫలం వాళ్ళకేనా దక్కుతుంది" తన నిశ్చయాన్ని చెప్పింది భానుమతి.

భానుమతీ! నాకూ బాధగానే ఉందమ్మా! భర్త బ్రతికుండి కన్న కూతురికి కన్యాదానం చేసుకోలేని పరిస్థితి నీది. పోనీలే! నువ్వు పసుపు, కుంకుమలతో ఉన్నావు. అదే చాలు నీకు'' పూజారిగారి ఓదార్పు.

ఆయన పెట్టిన ముహూర్తానికి భానుమతి కూతురి పెళ్ళి జరిగిపోయింది.

కాల ప్రవహంలో తన దిన చర్య, కుటుంబ భారం, దీర్ఘకాల ఎడబాటు భానుమతిలో నారాయణ జ్ఞాపకాల్ని, తలపుల్ని ఇంకా దూరం చేసాయి.

కానీ సుమంగళిగా ఆ ఊళ్లో తను పాదం పెట్టిన ఇంట్లో శుభం జరుగుతుందని, తనుచెయ్యేసి దీవించిన చిన్నారులకి జయం కలుగుతుందని, తనెదురొచ్చిన వ్యక్తికి తప్పక పనవుతుందని నమ్మకమున్న 'మనసున్న మనిషిగా, మంచి మనిషిగా' అనిపించుకుంది భానుమతి ఆ ఊరిచేత.

× × ×

మంచానపడ్డ పదిరోజులకే భానుమతి శాశ్వతంగా కన్నుమూసింది.'మొగుడు వదిలేస్తేనేం! కూతురికి పెళ్ళి చేసింది, స్వయం కృషితో ధైర్యంగా ఒంటరిగా బతికింది. పసుపు కుంకుమలతో , సుమంగళిగా పోయింది. ఎంతో పుణ్యం చేసుకుంది.' అనుకున్నారు ఊరంతా!!

ఆమెపోయిన నెలరోజులకి ఒకరోజుమధ్యాహ్నం మూడు గంటల వేళ భానుమతి ఇంటిపక్క అరుగుమీద కొంత మంది కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. ఆ సమయంలో ఆ అరుగు ఎదురుగా ఒకరిక్షా వచ్చి ఆగింది.ఒక ముసలాయన చిన్న సంచీతో రిక్షా దిగి అక్కడున్నవాళ్ళని, ఈ వీధిలో "భానుమతి ఇల్లెక్కడ?" అనడిగాడు.

"పైకిరండి! ఈ పక్కిల్లే! చెప్పారు వాళ్ళు .

ఒకావిడ ఇంట్లో కెళ్ళి చెంబుడు చన్నీళ్ళు తెచ్చిచ్చింది. అరుగు మీద పట్టి మంచం మీద కూర్చుని ఆ ఎండవేళ ఆ చన్నీళ్లు గడగడతాగి పైనున్న కండువాతో మూతి తుడుచుకుని అడిగాడు ఆ ముసలాయన.

" భానుమతి ఉందా"

"లేదు!పోయింది!. పాపం. నెలరోజులు అయింది" చెప్పింది ఒకావిడ.

" అయ్యో! అలాగ! భానుమతికి ఓ కూతురుండాలి!"

"అవునుఉంది. కూతురు, అల్లుడూ కాశీ వెళ్ళారు. నాలుగు రోజులయింది". చెప్పింది ఇంకో ఆమె.

"భానుమతి మొగుడు నారాయణ నాకు బంధువే! ఈ పక్కూరిలో పనుండి వచ్చాను. భానుమతిని చూసి ఎంతో కాలమయింది. ఒకసారి చూసి పోదామనుకున్నాను. మా నారాయణ మూర్ఖుడు. వ్యసనాలతో రోగాలు తెచ్చుకున్నాడు. పట్నంలో పెద్దాసుపత్రి వైద్యం ఏడాదిపాటు చేయించుకున్నాడు. చేసేవాళ్ళు,చూసేవాళ్ళు లేక ఒంటరిగా ఎంతో బాధపడ్డాడు. అక్కడికీ! ఒకటి రెండుసార్లు చూడ్డానికి వెళ్ళినప్పుడు "పెళ్ళాన్ని తీసుకు తెచ్చుకోరా!' అని చెప్పాను. విన్నాడుకాదు.వాడు చదువుకున్న మూర్ఖుడు, దుర్మార్గుడు" సణుక్కుంటూ అరుగు దిగి రిక్షా ఎక్కేసాడు ముసలాయన.

ముసలాయన రిక్షా ఊరి పొలిమేరదాటింది. ఒంటరిగా రోగంతో ఎంతో బాధపడ్డాడని,మూర్ఖంగా ప్రవర్తించాడనే అన్నాడుగానీ; నారాయణ పోయాడని,పోయి దాదాపు పాతికేళ్ళయిందనే విషయం వాళ్ళ దగ్గర ప్రస్తావించలేదా ముసలాయన. కారణం? ఇన్నాళ్ళూ వాళ్ళకు తెలియకుండా ఉంటుందా! అనుకున్నాడు. వాళ్ళకి తెలుసను కున్నాడు. ఆనాడు రాజన్న గార్కి పట్నం పెద్దాసుపత్రిలో కనపడ్డాక నారాయణకి వైద్య పరీక్షలు జరిగాయని, ఆ తర్వాత అతను ఒక సంవత్సరం మించి బ్రతకలేదని భానుమతితో సహా ఊళ్ళో వాళ్ళెవరికీ తెలియదు. అందుకే ఆ ఊళ్ళో అందరిదృష్టిలో భానుమతి సుమంగళిగానే ఉండిపోయింది.